ప్రజాశక్తి
మంగళవారం 16 డిసెంబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

## అమరజీవికి ఘన నివాళి

నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పి

ప్రజాశక్తి -పాడేరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ నివాళులర్పిం.చారు ఈసందర్భంగా మాట్లాడుతూ, ఆంధ్రరాష్ట్ర సాధనకు 58 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. రాష్ట్ర రాజధాని అమరావతి రాజధాని ప్రాంతంలో 58 అడుగుల పొట్టి శ్రీరాముల విగ్రహంతో పాటు స్మృతివనం ఏర్పాటు గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ఎస్పి అమిత్ బర్దార్, డిఆర్ఒ అంబేద్కర్, ఆర్‌డిఒ ఎంవిఎస్ లోకేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ ప్రసాద్ రావు, వివిధ విభాగల సిబ్బంది పాల్గొన్నారు.

# రెపరెపలాడిన కార్మిక పతాకం

### సిఐటియు అఖిలభారత మహాసభ నేపథ్యంలో ఊరూరా జెండా ఆవిష్కరణలు

అనంతగిరిలో కార్మిక పతాకానికి సెల్యూట్ చేస్తున్న గంగరాజు, తదితరులు

కొయ్యూరు, రాజేంద్రపాలెంలో జెండా ఆవిష్కరిస్తున్న సూరిబాబు, ఇతర నేతలు

**ప్రజాశక్తి అరకులోయ రూరల్:** సిఐటియు అఖిల భారత మహాసభను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం అరకులోయ మండల కేంద్రంలోని నాలుగు జంక్షన్ వద్ద సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, గిరిజన మ్యూజియం వద్ద డి రాజు యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, విశాఖపట్నంలో ఈ నెల 31 నుంచివచ్చేనెల 4 వరకు జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభలో యావత్ కార్మిక లోకం పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను రద్దుచేసి, లేబర్ కోడ్స్ అమల్లోకి తెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఆదివాసీల హక్కులపై కూడా కేంద్ర ప్రభుత్వం తీవ్ర దాడి చేస్తోందన్నారు.కార్మిక చట్టాల సవరణలు కార్మిక వర్గాన్ని మరింత దోపిడీకి గురిచేసే విధంగా ఉన్నాయనిఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కార్మికులు, ఆదివాసీలు, పేద ప్రజలు సంఘటితంగా పోరాటానికి సిద్ధం కావాలని, దీనికి సిఐటియు ఆల్ ఇండియా మహాసభ దిశానిర్దేశం చేయబోతుందని ఉమామహేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు, కొర్ర మగ్గన్న, రాజు, కె రామారావు, పి బాలకష్ణ, ఆటో యూనియన్ నేతలు కార్మికులు పాల్గొన్నారు.

**కాశీపట్నం:** సిఐటియు అఖిల భారత 18 వ మహాసభ సందర్భంగా అనంతగిరి మండల కేంద్రంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కిల్లో మొస్య అధ్యక్షతన యూనియన్ జెండాను అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జి కళావతి ఆవిష్కరించారు. ఈసందర్భంగా స్థానిక సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ మహాసభ స్ఫూర్తితో 4 లేబర్ కోడ్ రద్దు అయ్యే వరకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఇతర సమ్యలను పరిష్కరానికి సంఘటితంగా పోరాటానికి సన్నద్ధం కావాలని, దీనికి సిఐటియు మహాసభ దిశానిర్ధేశం చేస్తుందన్నారు.కార్యక్రమంలో అంగన్ వాడీ, విద్యుత్ కార్మికులు, సిపిఎం నాయకులు సోమెల నాగులు,కాకర సింగులు,భీమన్న, భీమరాజు మహిళా సంఘం నాయకులు దీసారి దేముడుమ్మ, కాసులమ్మ స్వాభి పాల్గొన్నారు.

**ముంచింగిపుట్టు** : మండల కేంద్రంలోనీ ప్రధాన రహదారి కూడలిలో సిఐటియు జెండాను వివిధ కార్మికుల సంఘాల నేతల ఆధ్వర్యంలో యూనియన్ మండల కార్యదర్శి కె.శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలన, నాలుగు లేబర్‌కోడ్స్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కార్మికులు, అన్నివర్గాలు పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 31నుంచి వచ్చేనెల 4 వరకు విశాఖలో జరగనున్న సిఐటియు అఖిల భారత మహాసభ భవిష్యత్ పోరాట కార్యాచరణపై దిశానిర్ధేశం చేయనుందన్నారు. మహాసభకు అన్ని కార్మిక సంఘాలు, ప్రజలు సహకరించి జయప్రదం చేయాలన్నారు.కార్యక్రమంలో లక్ష్మీపురం సర్పంచ్ కె త్రినాథ్, ఆటో యూనియన్ నేత పి శ్యాంసుందర్ భవన నిర్మాణ సంఘం నాయకుడు నాగరాజు, శానిటేషన్ కార్మికులు, వెలుగు విఒఎ దాశరధి పాల్గొన్నారు.

**చింతపల్లి :** సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా చింతపల్లి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో సిఐటియు జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్ ఆవిష్కరించారు. ఈ సందర్భాంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం అంబానీ, అదాని, టాటా, బిర్లా వంటి కార్పొరేట్ వర్గాలకే సేవ చేస్తోందని, సామాన్య ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. మహాసభలు సందర్భంగా జనవరి 4న విశాఖ ఆర్కే బీచ్‌లో జరిగే బహిరంగ సభకు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలన కోరారు. కార్యక్రమంలో పరిశోధన కేంద్ర కార్మికులు నాయకులు రాజులమ్మ, ఎస్‌కే.రహిమాన్, అర్జున్, నర్సింగ రావు, రాములమ్మ పాల్గొన్నారు.

**కొయ్యూరు:** ఐక్యతతోనే పెట్టుబడిదారీవిధానాన్ని కూల్చి కార్మిక, కర్షక రాజ్యాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యమని సిఐటియు మండల నాయకులు ఎస్.సూరిబాబు అన్నారు. మండల కేంద్రంలోని రాజేంద్రపాలెం వద్ద సోమవారం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఎస్ సూరిబాబు. కే.మల్లేష్. కే.చంటి. ఎస్. శోభన్‌బాబు. భవాని వెలుగు విఒలు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశవ్యాప్తంగా యావత్తు కార్యవర్గాన్ని ఐక్యపరచడం సిఐటియు ఆశయం అన్నారు. ఐక్యతతోనే పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చి కార్మిక,కర్షక రాజ్యాన్ని స్థాపించడం సిఐటియు లక్ష్యమని తెలిపారు.

అరకులోయ, చింతపల్లి, ముంచంగిపుట్టులో సిఐటియు పతాకావిష్కరణలో ఉమామహేశ్వరరావు, చిన్నయ్యపడాల్ తదితరులు

# అక్రమార్కుల చెరలో .. సూరంపాలెం కెనాల్

- ఆక్వా పెంపకానికి వినియోగిస్తున్న సాగునీరు
- ఇంజన్లతో నీటిని తోడేస్తున్న వైనం
- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆందోళనలో రైతన్నలు

సూరంపాలెం కెనాల్‌లో ప్రవహిస్తున్న నీరు

కెనాల్ నీటితో ఏర్పాటు చేసిన చేపల చెరువు

ప్రజాశక్తి - గంగవరం : గంగవరం మండలం సూరంపాలెం పంచాయతీ, సూరంపాలెంలో 2006లో సూరంపాలెం రిజర్వాయర్ స్థాపించారు. ఈ రిజర్వాయర్ నుంచి వచ్చే కెనాల్ ఆయకట్టు కింద 13,500 ఎకరాలు భూమి సాగు అవుతోంది. గంగవరం, గోకవరం, కోరుకొండ మండలాల్లోని సుమారు 20 గ్రామాల్లోని వ్యవసాయ భూములకు దీని ద్వారా సాగు నీరు అందుతోంది. సంవత్సరానికి మూడుసార్లు ఈ కెనాల్ ద్వారా రైతుల వ్యవసాయ అవసరాలకు నీటిని విడుదల చేస్తారు. అయితే ఇంత చరిత్ర ఉన్న ఈ కెనాల్ ప్రస్తుతం ఆక్వా వ్యాపారుల చేతచిక్కి బక్కచిక్కిపోతోంది. మన్యంలో సాగు అవసరాల కోసం, తద్వారా గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం నిర్మించిన రిజర్వాయర్ అక్రమ ఆక్వా రైతుల పాలిట వరంగా మారింది. రెవెన్యూ, రిజర్వాయర్ ఇంజనీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరత కారణంగా అక్వా వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా విరాజిల్లుతోంది. గిరిజనేతర ఆక్వా వ్యాపారులు అధికారులకు ముడుపులు చెల్లించి యథేచ్ఛగా చెరువులు నిర్మాణం చేపట్టి వ్యాపార కార్యాకలాపాలు సాగిస్తున్నారు. నెల్లిపూడి, చిన్నంపాలెం,కొత్తాడ, ఉమ్మెత్త తదితర ప్రాంతాల్లో చెరువులు తవ్వి వాటిలోకి రిజర్వాయర్ కెనాల్ నుంచి నీటిని నింపి ఆక్వా సాగు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం రెవిన్యూ, రిజర్వాయర్ అధికారులు చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. బహిరంగంగా ఇంజన్లు పెట్టి నీరు తోడేస్తున్నా సంబంధిత అధికారులు కిమ్మనకుండా ఉన్నారు. రిజర్వాయర్ సిబ్బంది నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన కెనాల్ కు నీటిని సరఫరా చేస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు కూడా చర్యలు చేపట్టకపోవడం విశేషం. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన కెనాల్‌ను దానికోసమే వినియోగించాలని ఇలా ఎవరికి నచ్చినట్టు వారు నీరు తోడేస్తుంటే అదును కాలానికి వ్యవసాయానికి సాగునీరు అందక ఇబ్బంది పడాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై ఎఇ గంగాధర్‌ను వివరణ కోరగా కెనాల్ నుంచి రైతులు తమ సాగుభూములకు నీటిని వాడుకుంటున్నారని పైప్‌లైన్ ద్వారా నీటిని తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మార్వో శ్రీనివాసరావు ఈ విషయమై స్పందించలేదు. ఆర్ఐ లక్ష్మణరావు స్పందిస్తూ మేము ఆక్వా చెరువుల నిర్మాణానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. విఆర్ఒ అప్పలకొండ అసలు అక్కడ చెరువులు తవ్వినట్టు తమకు తెలియదని స్పష్టం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సాగునీటిని సాగునీటి అవసరాలకు మాత్రమే వినియోగించేలా చర్యలు తీసుకుని తమను ఆదుకోవాలని ఆయా మండలాల్లోని రైతులు కోరుతున్నారు.

ఇంజన్‌తో నీటిని చేపల చెరువులోకి తోడుతున్న దృశ్యం

# అమరవీరుల ఆశయ సాధనకు పోరాడాలి

ప్రజాశక్తి -చింతూరు: ఈ నెల 21వ తేదీన జరిగే సిపిఎం అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని వారి ఆశయసాధన కోసం పోరాడాలని ఐద్వా మండల కమిటీ నాయకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జెడ్పిటిసి సీనియర్ నాయకురాలు ముర్రం రంగమ్మ మాట్లాడుతూ ప్రజల కోసం బడుగు బలహీన వర్గాల కోసం శ్రమించి అసువులు బాసిన అమరవీరులను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న సంస్మరణ సభకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కామ్రేడ్ పాయం సీతమ్మ 16వ వర్ధంతి సభ నిర్వహించారు. సీతమ్మ చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐద్వా మండల కమిటీ సభ్యులు కట్టం రాములమ్మ, శారద, కూర శాంతమ్మ, తాటి జయలక్ష్మి పాల్గొన్నారు.

**విఆర్‌పురం :** ఈ నెల 21న చింతూరులో అమరవీరుల సంస్మరణ సభను విజయవంతం చేయాలని ఐద్వా మండల కార్యదర్శి సోడి రమాదేవి తెలిపారు. రామవరం పంచాయతీ అడవివెంకన్న గూడెంలో ఐద్వా ఆధ్వర్యంలో పాయం సీతమ్మ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి సోడి రమాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఐద్వా మండల అధ్యక్షురాలు కారం లక్ష్మి మాట్లాడుతూ పాయం సీతమ్మ చిన్నతనం నుంచే ప్రజాసమస్యలపై జరిగే పోరాటాల్లో చురుగ్గా పాల్గొన్నారని కొనియాడారు. తునికాకు పోరాటంలో కూడా పాల్గొన్నారన్నారు. కార్యక్రమంలో కుంజా పూజ, కారం జ్యోతి, తెల్లం లాలమ్మ, డుమ్మిరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌పురం: నివాళులర్పిస్తున్న ఐద్వా మండల కార్యదర్శి సోడి రమాదేవి

# ఇంధన పొదుపుపై అవగాహనా ర్యాలీ

ర్యాలీ ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు: ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా సోమవారం పాడేరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు ర్యాలీని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టార్ రేటింగ్ ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలు మాత్రమే వాడాలన్నారు. బల్బులు, ఫ్యాన్లు, టీవీలు ఫ్రిజులు, ఎసిలు వంటి విద్యుత్ ఉపకరణాలు ఉన్నాయని వాడుకోవడం కాకుండా అవసరమైనప్పుడు మాత్రమే వినియోగించడం ద్వారా విద్యుత్‌ను ఆదా చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇంధనం పొదుపుపై వివిధ కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలని విద్యుత్ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయం నుంచి అంబేద్కర్ కూడలి వరకు భారీ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఎస్పి అమిత్ బర్దర్, విద్యుత శాఖ ఎస్ఇ జీఎన్. ప్రసాద్, ఇఇ ఎలోసిహెచ్. పాత్రుడు, పాడేరు డివిజన్ ఇఇ ఎల్. వేణుగోపాల్, సర్కిల్ ఆఫీస్ కమర్షియల్ ఎడిఇ భాస్కరరావు, సర్కిల్ ఆఫీస్ ఎఒ శ్యామల రావు. పిఒ కిరణ్ కుమార్, పాడేరు ఆపరేషన్స్ ఎడిఇ ప్రసాద్, చింతపల్లి ఎడిఇ రాంబాబు, అరకు ఎడిఇ శ్రీనివాస్ సర్కిల్ ఆఫీస్ సిబ్బంది, డివిజన్ కార్యాలయ సిబ్బంది, పాడేరు లైన్ ఇన్‌స్పెక్టర్ త్రిమూర్తులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదివాసీలకు రగ్గుల పంపిణీ

రగ్గులు పంపిణీలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు బాబూరావు

ప్రజాశక్తి-అనంతగిరి : మండలంలోని మాలింగ వలస, పాతకోట గ్రామాల్లో గిరిజనులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రగ్గులు పంపిణీ చేశారు. 40 గిరిజన కుటుంబాలకు రగ్గులు, తువ్వాలు, వారి పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సూరెడ్డి బాబురావు మాట్లాడుతూ గిరి పుత్రులు ఉన్నత చదువులకు అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందించడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. మరో ఉపాధ్యాయుడు ఎల్‌వి.నారాయణరావు మాట్లాడుతూ బాల్య వివాహాలు వల్ల కలిగే నష్టాలు వివరించారు. మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిల్లి శ్రీరాములు, అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, లెక్కల సత్యనారాయణ, కిషన్, సంతోష్, స్థానికులు రామకృష్ణ, రమేష్ గిరిజనులు పాల్గొన్నారు.

## జిల్లా సైక్లింగ్ అంబాసిడర్‌గా అజయ్

అజయ్ తండ్రికి ఆర్థిక సాయం అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి -పాడేరు : అల్లూరి జిల్లా సైక్లింగ్ బ్రాండ్ అంబాసిడర్‌గా అరకు వ్యాలీ మండలం సుంకరమెట్ట పంచాయతీ, దొండపాడు గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ పిట్టలి అజయ్‌ను నియమిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ప్రకటించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన పిట్టలి అజయ్ తండ్రి పిట్టలి లైభన్‌కు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ ఆర్థిక సహాయంతో మౌంటెన్ ట్రయల్ బైక్ కొనుక్కొని జిల్లాలో నలుమూలలా ఉన్న ి కొత్త ట్రైల్ రూట్స్, ట్రాక్స్ బయట ప్రపంచానికి తెలియజేయాలని, జిల్లాలో సైక్లింగ్ ద్వారా పర్యాటకాన్ని ప్రమోట్ చేయాలన్నారు.కార్యక్రమంలో అడ్వెంచర్ ఔత్సాహిక విద్యార్థి బాటం తేజస్వరరావు పాల్గొన్నారు.కాగా గతేడాది అరకు చలి ఉత్సవంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో భాగంగా బొర్రా గుహలు నుండి అరకు వ్యాలీ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ వరకు 36 కిలోమీటర్ల మేర నిర్వహించిన సైక్లింగ్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచిన విద్యార్థి పిట్టలి అజయ్. 13 ఏళ్ల పిట్టలి అజయ్ ప్రస్తుతం గుమ్మకోట ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్నాడు.

## పోరాట యోధురాలు పాయం సీతమ్మ

నివాళులర్పిస్తున్న మేకల నాగేశ్వరరావు తదితరులు

ప్రజాశక్తి- కూనవరం: కూనవరం మండలం పెద్దార్కూరులో పాయం సీతమ్మ వర్ధంతిని సోమవారం సిపిఎం నాయకులు నిర్వహించారు. పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి ఆమెకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాయం సీతమ్మ ప్రజా సమ స్యలపై జరిగే పోరాటాల్లో చురుగ్గా పాల్గొనేవారని గుర్తు చేశారు. కార్యక్రమం లో జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వర రావు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మడకం నాగమణి మండల కమిటీ సభ్యు లు పాయం సత్యనారాయణ ఎంపిటిసి ధర్ముల అమ్మాజీ, శాఖ కార్యదర్శులు పాయం వెంకటేశ్వర్లు, మడకం సత్యనారాయణ, ఉయక కన్నయ్య, కుటుంబ సభ్యులు పాయం రాజయ్య, సున్నం రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన టిడిపి నాయకులు

## పంచాయతీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి

ప్రజాశక్తి-సీలేరు: రాబోయే పంచాయతీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా నాయకులు కార్యకర్తలు పనిచేయాలని సీలేరు టిడిపి అధ్యక్షుడు ఎస్‌కె నాగూర్ సీనియర్ నాయకులు బొర్రా కృష్ణ పిలుపునిచ్చారు. అల్లూరి జిల్లా టిడిడి ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వర్ ఆదేశాల మేరకు సీలేరులో సోమవారం కూటమి నాయకులు సమావేశమయ్యారు. టిడిపి సీలేరు మాజీ టౌన్ అధ్యక్షుడు సన్యాసిరావు, మహిళా కార్యకర్తల ఆధ్వర్యంలో పలు అంశాలపై చర్చించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లో గెలుపుపై ప్రతి ఒక్కరు కలిసికట్టుగా పనిచేయాలని పేర్కొన్నారు. రాబోయే ఎంపిటిసి ఎన్నికల్లో కూడా టిడిపి ఘన విజయం సాధించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజల్లో బలంగా తీసుకెళ్లేందుకు కార్యచరణ రూపొందించారు.. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శతశాతం ఉత్తీర్ణతపై దృష్టి సారించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్

ప్రజాశక్తి - కొయ్యూరు : 100 రోజుల ప్రణాళిక పక్కాగా అమలు చేసి, పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా బోధనపై దృష్టి సారించాలని కొయ్యూరు ఎటిడబ్ల్యూఒ క్రాంతి కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందు గా వసతిగృహంలో వంటశాల, భోజనశాలను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

## రేషన్ పంపిణీ గడువు పెంచాలని వినతి

ప్రజాశక్తి- జికె వీధి: మండలంలోని రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీకి 15 తేదీతో గడువు ముగుస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మరో ఐదు రోజులు గడువు పెంచాలని మండల రేషన్ డీలర్లు గూడెం కొత్తవీధి తహశీల్దార్ అన్నాజీరావుకు వినతిపత్రం అందజేశారు. సాంకేతిక సమస్యలతో ఎంఎల్ఎస్ పాయింట్‌కి బియ్యం చేరకపోవడం అక్కడినుండి రేషన్ దుకాణాలకు నేటి వరకు సరుకుల సరఫరా పూర్తిస్థాయిలో చేరకపోవడంతో పాటు సమయం ముగియడంతో గడువు పెంచాలని గూడెం కొత్త వీధి రేషన్‌డీలర్లు వినతిపత్రం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో జికె వీధి మండల రేషన్ డీలర్లు ఖఘుపతి, ప్రసాద్, విజయ్‌మహేశ్వరి, రాజేష్, నూకరత్నం చందూర్ తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ అన్నాజీరావుకు వినతిపత్రం అందిస్తున్న రేషన్‌డీలర్లు

# గంజాయి నిర్మూలనకు పక్కా ప్రణాళిక

- గ్రామ, హ్యాబిటేషన్ స్థాయిలో సర్వే
- మండల కమిటీల ఏర్పాటు తప్పనిసరి
- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలో గంజాయి రవాణా, నిర్మూలనకు పక్కా ప్రణాళికలు తయారు చేయాలని, మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గంజాయి నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో తీసుకున్న కార్యాచరణ ప్రణాళిక అమలుపై పనితీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అల్లూరి జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయి రవాణా చేయడం చాలా కష్టమనే పరిస్థితిని తీసుకురావాలన్నారు. జిల్లాలో ఏ ప్రాంతాల నుండి ఎక్కువ గంజాయి రవాణా అవుతుందో పోలీసు,ఎక్సైజ్ శాఖల అధికారులనుండి అరా తీశారు. ప్రతి నెలా నిర్వహించే సమావేశానికి క్షేత్రస్థాయిలో రూపకల్పన చేసిన ప్రణాళికతో పాటు నిర్మూలనకు చేపట్టిన చర్యలపై డేటాతో రావాలని సంబంధిత శాఖలను ఆదేశించారు. గ్రామసభలు నిర్వహణ, పిల్లలకు వారి తల్లిదండ్రులకు అవగాహన పనితీరుపై వివరాలతో రావాలన్నారు. గ్రామాలలో రైతులు ఎవరు ఏయే పంట పండిస్తున్నారో, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులకు పూర్తి అవగాహనఉండాలన్నారు. అప్పుడే అధికారులకు గంజాయి సాగును నియంత్రించి, సులభతర పంటలవైపు వారి మళ్లించవచ్చున్నారు. ప్రత్యమ్మాయ పంటలపై ఎంతమంది రైతులకు లబ్ది కల్పించారని ఆరా తీశారు. జిల్లాలో వన్నరబుల్ గ్రామాలు మీద ఎక్కువ దష్టి పెట్టాలని సూచించారు. పాఠశాలల్లో, కాలేజీల్లో ఫిర్యాదులు బాక్స్ పెట్టాలని, వచ్చిన ఫిర్యాదులపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఫిర్యాదు బాక్సుల్లో వేసిన ఫిర్యాదులపై ఐటిడిఎ ప్రాజెక్టు అధికారులు, ఎటిడబ్ల్యుఒలు, ఎంఇఒలు పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పిల్లలకు వారి తల్లిదండ్రులకు వారానికి ఒకటి లేదా రెండు సెషన్స్‌లో అవగాహన కల్పించాలన్నారు. యువత గంజాయి వాడకంవైపు మళ్లడానికి కారణాలను వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. డిగ్రీ, ఇంటర్ కళాశాలలో, ఆశ్రమ పాఠశాల, కెజిబివిల్లోవిద్యార్థులు చెడుమార్గంవైపు మళ్లకుండా వారికి ఉపాధి శిక్షణ, క్రీడా ఆధారిత కార్యక్రమాలు రూపొందించి, విద్యార్థుల ఖాళీ సమయంలో అవి అమలయ్యేలా చూడాలని ఆదేశించారు. విద్యాసంస్థల్లో స్పోర్ట్స్ క్లబ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రవర్తనపై ప్రజెంటేషన్ మాడ్యూల్స్ తయారుచేసి పాఠశాల, కాలేజ్ ఉపాధ్యాయులు గ్రహించేలా సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి మండలంలో యూత్ క్లబ్ ఏర్పాటు చేసి యువతను పాజిటివిటీ వైపు నడిపించే దిశగా నిమగ్నం చేయాలని సూచించారు. ఆదివాసి సేవా కేంద్రాల సిబ్బందికి గంజాయి సాగు, రవాణా గుర్తించేలాగా శిక్షణ ఇప్పించాలని గిరిజన సంక్షేమ శాఖకు ఆదేశించారు.

జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా చేసిన వారితోపాటు వారి బంధువులపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎక్కడికక్కడే చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి గంజాయి నియంత్రణకు చర్యలు చేపడుతున్నామన్నారు సమాజంలో మార్పు రావాలంటే యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, మంచి మార్గంలో నడవాలని , వారు నిర్దేశించిన లక్ష్యాలకు చేరుకోవాలని సూచించారు. ఇతర రాష్ట్రం నుంచి వచ్చిన గంజాయి స్మగ్లర్లకు ఆశ్రయం కల్పించడం నేరమని, అలా చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. బ్యాంకులలో నిరుద్యోగులు ఖాతాల్లో పెద్ద మొత్తం లో నగదు జమ అయితే దానిపై నిఘా పెట్టాలన్నారు. విఆర్ఒలు, వెల్ఫేర్‌సెక్రటరీలు, రెవెన్యూ అధికారులకు దీనిపై పూర్తి అవగాహన నిఘా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌బిఎస్ నంద్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్, జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీ, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆర్ఐఒ భీమ్ శంకర్, కాలేజ్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు పరిమళ, జిల్లా ఉద్యాన అధికారి కెబి కర్ణ, పాడేరు రంపచోడవరం చింతూరు ఫారెస్ట్, పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ, అటవీశాఖ, ఉద్యాన, వైద్య, విద్య, ఐసిడిఎస్, డిఆర్‌డిఎ, గిరిజన సంక్షేమం, ఎక్సైజ్, బ్యాంక్, ఇతర శాఖల అధికారులతో ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కుళాయి లీకేజీకి మరమ్మతులు

### - ఆదివాసీ గిరిజన సంఘం నేతల చొరవ

మరమ్మతులు చేయిస్తున్న ఆదివాసీ గిరిజన నేతలు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:అరకువేలి మండలం, మాదల గ్రామపంచాయతీ దాబుగుడ గ్రామంలో లీకౌతున్న కుళాయి పైపులైన్‌కు ఆదివాసి గిరిజన సంఘం నాయకులు చొరవతో సోమవారం మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా మాదల పంచాయతీ ఆదివాసీ గిరిజన సంఘం నాయకుడు రమేష్ మాట్లాడుతూ, జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన కుళాయి పైపు సంవత్సర కాలంలోనే లీక్ కావడం వల్ల రెండు రోజులుగా గ్రామంలో తాగునీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రతను గుర్తించి, స్థానిక ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో కుళాయి మరమ్మతు పనులు చేపట్టినట్లు తెలిపారు. నిర్మాణ సమయంలో నాణ్యతగా పనులు చేపట్టకపోవడ, అధికారుల పర్యవేక్షణాలోపం వల్లే ఎన్నాళ్లో కాకుండానే పైపులైన్ లీకేజీలు ఏర్పడ్డాయని ఆరోపించారు. దీనికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు రాము, పీసా ఉపాధ్యక్షులు గురుమూర్తి, రామచందర్, సోన్ను పాల్గొన్నారు.

## జిసిసి హాట్ బజార్ ప్రారంభం

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: రూ.ఐదు లక్షల ఐటిడిఎ నిధులతో నిర్మించిన జిసిసి హాట్ బజార్‌ను కండ్రం పంచాయతీ సర్పంచ్, సర్పంచ్‌ల పోరం మండల అధ్యక్షుడు కె.హరి సోమవారం ప్రారంభించారు. గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను ఈ హాట్ బజార్ ద్వారా విక్రయాలు సాగించుకోవడానికి అవకాశం ఉంటుందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఎస్ ఆనంద్, వెలుగు సిసిలు పార్వతమ్మ,( తినాధ్, విఎఒ రాము, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

## సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎంలు

ప్రజాశక్తి డుంబ్రిగుడ : మండలంలోని కిల్లోగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నేచర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన కల్పించారు, ఈ వ్యాధి పట్ల భయం కాకుండా జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. సికిల్ సెల్ ఆనీమియా అంటే ఏమిటి, ఇది ఎలా వస్తుంది, దీని లక్షణాలు, పరీక్షలు, చికిత్స విధానాల గురించి విద్యార్థులకు సులభమైన పద్ధతిలో అవగాహన కల్పించారు. చిన్నవయస్సులోనే పరీక్షలు చేయించుకోవడం వల్ల భవిష్యత్తులో వచ్చే సమస్యలను ఎలా నివారించవచ్చుననే దానిపై వివరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆశ్రమ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, వెంకటరావు, సిబ్బంది పాల్గొన్నారు.

శిబిరంలో రక్తదానం చేస్తున్న దాతలు

## రక్తదానంతో ప్రాణదాతలు కావాలి

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: రక్తదానం చేసిన ప్రతి రక్తపు బొట్టు ఓ ప్రాణాన్ని నిలబెడుతుందని, రక్తదానంతో ప్రాణదాతలుగా మారాలని తహసీల్దార్ త్రివేణి పిలుపునిచ్చారు. సోమవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా బ్రాంచి ఆధ్వర్యాన జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని అధికార యంత్రాంగంతోపాటు ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గంగరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి నాగరాజు మాట్లాడుతూ, గిరిజన ప్రజల భాగస్వామ్యం, యువతి, యువకులు రక్తదానాన్నిచ్చి పది మందికి స్ఫూర్తిగా నిలవాలన్నారు. శిబిరంలో పది యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి సూర్యారావు, ఎంపిడిఒ ప్రేమ్ సాగర్, డాక్టర్ నాగవేంద్ర, కార్యవర్గ సభ్యుడు ప్రసాద్ నాయుడు, రాష్ట్ర కనీస సలహా మండలి డైరెక్టర్ సుబ్బారావు, టిఎన్‌టియుసి ప్రధాన కార్యదర్శి స్వామి పాల్గొన్నారు.

## సిఎం సహాయనిధి చెక్కు అందజేత

సాయం చెక్కు అందజేస్తున్న దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని గూడ పంచాయితీ మర్రిపుట్టి గ్రామానికి చెందిన తుడుం చిన్నబాబుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎపిఎస్ఆర్‌టిసి విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర సోమవారం అందజేశారు. చిన్న బాబు స్వగృహానికి స్వయంగా వెళ్లిన దొన్నుదొర లబ్ధిదారునికి చెక్కును అందజేసి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంలో కాలు విరగడంతో చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న చిన్నబాబుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించారని చిన్నబాబు తెలిపారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ, నిరుపేదలకు సహాయం చేయడంలో కూటమి ప్రభుత్వం ముందంజలో ఉందని, ప్రజల కష్టాలను తీర్చేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నదన్నారు. చిన్నబాబు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని ఆయనతోపాటు కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో గూడ సర్పంచ్ జ్ఞాన ప్రకాష్, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి బొడ్డ శ్యామ్, బాకూరు సర్పంచ్ వెంకట రమణ రాజు, టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ అధ్యక్షులు శంకర నాయుడు, నియోజకవర్గ మహిళా అధ్యక్షులు సూర్యకాంతం,పిఎసిఎస్ మాజీ చైర్మన్ కమ్మిడి రాంబాబు, మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు నాగేశ్వరావు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టం నిర్వీర్యానికి కుట్ర

ప్రజాశక్తి -పాడేరు: ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యంచేసి దాని స్థానంలో కొత్త పథకాన్ని తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని మరో కొత్త చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తోందని, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా పూర్వ అధ్యక్షులు పాలికి లక్కు ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ చట్టం మార్పుతో కేంద్రం నుంచి రాష్ట్రాలకు వచ్చే నిధుల్లో భారీ కోత పడే అవకాశం ఉందని ఆవేదన వెలిబుచ్చారు. ఒక్క ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రూ.5000 కోట్లు వరకు కోతపడే అంచనా ఉందన్నారు ప్రస్తుతం చట్టంలో పేర్కొన్న విధంగా జాబ్‌కార్డులకు 125 రోజులు పని కల్పన జరగకపోవచ్చన్నారు. ఉపాధి చట్టంలో మార్పులు తెచ్చి నిర్వీర్యం చేసే విధానాలకు స్వస్తి పలికి, చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## ముందస్తు క్రిస్మస్ వేడుకలు

ముందస్తు క్రిస్మస్ వేడుకల్లో క్రైస్తవులు

ప్రజాశక్తి- హుకుంపేట: మండల కేంద్రంలోని క్రీస్తు ప్రేమ సువార్తిక సహవాసము (సీఎల్ఈఎఫ్) చర్చ్‌లో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిఎల్ఈఎఫ్ చర్చ్ వ్యవస్థాపకులు పాస్టర్ కె.నెహెమ్యా ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వైజాగ్ నుంచి వచ్చిన వై. ఎలీషారాజు క్రిస్మస్ పండుగ గురించి, యేసు క్రీస్తు ప్రేమ, క్షమ, త్యాగం, దయలకు ప్రతీక అని వివరించారు. సమాజంలో ఉన్న ద్వేషాలు, విభేదాలను విడిచిపెట్టి శాంతి, సౌభ్రాతత్వంతో జీవించాలని పిలుపునిచ్చారు. పేదలు, బాధితులు, ఒంటరిగా ఉన్నవారికి అండగా నిలవడమే క్రీస్తు జన్మ సందేశమన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో సంఘ పెద్దలు లకే. చిట్టమ్మ, తాటికొండ పౌలు, ఐ. జోసెఫ్‌రాజు, వివిధ చర్చిల పాస్టర్లు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రేషన్ పంపిణీ చేస్తున్న డీలర్

## ఏజెన్సీలో రేషన్ కష్టాలు

ప్రజాశక్తి- మోతుగూడెం: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పంచాయతీ పరిధిలో ఫోర్ బై గ్రామంలో రేషన్‌డిపో వద్ద రేషన్ పొందేందుకు లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మారుమూల గ్రామాల్లో సిగ్నల్స్ అందక అవస్థలు పడుతున్నారు. ఫోర్ బై చుట్టూ ప్రక్కల గ్రామాలు ఇంతులూరువాగు,ఒడియా క్యాంపు, ఎంసిడి క్యాంప్, అటవీ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేని రాజ్ క్యాంప్ గ్రామస్తులు మొత్తం 175 కార్డుదారులు ఉన్నారు. వీరందరూ రేషన్ ఫోర్‌బైలోనే తీసుకోవాలి. డీలర్ భవాని సిగ్నల్ వస్తున్న అటవీ ప్రాంతంలోకి వెళ్లి అక్కడకి కార్డుదారులని పిలిచి వేలిముద్ర వేయించుకుని రేషన్ అందిస్తున్నారు. రేషన్ కోసం కూలికి కూడా వెళ్లకుండా ఉంటున్నామని లబ్ధిదారులు, సిగ్నల్స్ కోసం కొండలు ఎక్కాల్సి వస్తోందని డీలర్ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సెల్ సిగ్నల్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి క్రాంతిసౌజన్య

## స్క్రబ్‌టైపస్‌పై ఆందోళన వద్దు

దేవీపట్నం -ప్రజాశక్తి: దేవీపట్నం మండలం ఇందుకూరుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ క్రాంతిసౌజన్య ఆధ్వర్యంలో స్క్రబ్ టైపస్ వ్యాధిపై సోమవారం అవగాహన కల్పించారు. వ్యాధి సోకినవారు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ఎస్‌సిఒ శ్రీరామమూర్తి ఎంపిహెచ్ఒ శ్రీనివాస్ హెచ్ఎస్ నాగేశ్వరరావు వైద్యసిబ్బంది ఏఎన్ఎం హెల్త్ అసిస్టెంట్ ఎంఎల్ హెచ్ పీస్ ఆశాలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు. వ్యాధి గురించి ఎవరూ భయపడాల్సిన పనిలేదని వైద్యాధికారి అందరికీ వివరించారు.

## ఎల్లవరం రోడ్డు పనుల పరిశీలన

పనులు పరిశీలిస్తున్న మధుకుమార్

ప్రజాశక్తి - జికె వీధి: మండలంలోని వంచల పంచాయతీ ఎల్లవరం, కట్టువీధి గ్రామస్తుల కోసం నిర్మిస్తున్న రోడ్డు పనులను జనసేన పార్టీ వంచుల పంచాయతీ అధ్యక్షులు కూడా మధుకుమార్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, దీంతో మారుమూల గ్రామస్తుల కష్టాలు తీరానున్నాయని అన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పాంగి చిట్టిబాబు, వెంకటరావు, రోడ్డు కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ పాంగిరాము, పాంగి లక్ష్మణ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## సృజనాత్మకతను వెలికి తీసేందుకే చెకుముకి పోటీలు

### - సైన్స్ సంబరాలు పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కన్నారావు

ప్రజాశక్తి-కూనవరం: కూనవరం మండల కేంద్రంలోని విద్యా వనరులు కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో డిసెంబర్ 21,22,23 తేదీలలో కాకినాడలోని జెఎన్టీయూలో జరిగే రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు 2025 వాల్‌పోస్టర్స్‌ను అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి. కన్నారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి పోటీలు విద్యార్థులలో సైన్స్ పట్ల అభిరుచిని కల్గించడంతో పాటు సైన్స్ పట్ల ఆసక్తిని, ప్రశ్నించే తత్వాన్నీ పెంపొందించడం జరుగుతుందన్నారు. విద్యార్థుల్లో దాగిఉన్న సజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ చెకుముకి రాష్ట్ర స్థాయి సంబరాలు ఉపయోగపడతాయన్నారు. జనవిజ్ఞాన వేదిక గత 35 సంవత్సరాల నుండి తెలుగు విద్యార్థుల కోసం ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో నిర్వహిస్తున్నారని జిల్లా స్థాయిలో మొదటి స్థానం సాధించిన ప్రభుత్వ ప్రైవేట్‌టీమ్ విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో శాంతి,రాధా కుమార్, యమాని, సత్య, ప్రమీల, మహతి, కుమారి, సుల్తాన్, రాంబాబు, ఆనంద్, శాంత, తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని

# ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి

**పాడేరులో వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ**

ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర నేతలు

ప్రజాశక్తి పాడేరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పిపిపి విధానంలో ప్రయివేటుకు ఇవ్వాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోవాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. సోమవారం పాడేరులో వైసిపి ప్రజా ఉద్యమ ర్యాలీ నిర్వహించారు స్థానిక ఎమ్మెల్యే వైసిపి అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ పత్రాలను పాడేరు పట్టణంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మెయిన్ రోడ్డు మీదుగా విఆర్ ఫంక్షన్ హాల్ వరకు ఊరేగించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో తాడేపల్లికి తరలించే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో ఊరేగింపు సాగింది.కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పలువురు నాయకులు ర్యాలీలో ముందుండి నడిచారు.

**సీలేరు:** మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సోమవారం పాడేరులో ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీకి సీలేరు పంచాయతీ నుంచి వైసీపీ నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లినట్లు వైసిపి సర్పంచ్ పాంగి దుర్గో టౌన్ అధ్యక్షుడు పేలురి సత్యనారాయణ (బుజ్జి) పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వ్యతిరేక పోరాటంలో భాగంగా జిల్లాలో అన్ని పంచాయతీల నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లి ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నామన్నారు. ఎమ్మెల్యే విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశామన్నారు. ర్యాలీ విజయవంతమైందని సర్పంచ్ దుర్గో పేర్కొన్నారు.

## జిసిసి ప్రతిష్టకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

**సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్**

జిసిసి అధికారులతో మాట్లాడుతున్న చైర్మన్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-చింతపల్లి : జిసిసి ప్రతిష్టకు చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని అధికారులను జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ హెచ్చరించారు. సోమవారం ఆయన చింతపల్లి మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన రైతుల శ్రేయస్సే లక్ష్యంగా కాఫీ కొనుగోలు ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జీసీసీ కాఫీ కొనుగోలు ధరలను ప్రకటించిన ఆయన, ఇవి గిరిజన కుటుంబాలకు గణనీయమైన ఊరటనిస్తాయని తెలిపారు. మధ్యవర్తుల దోపిడీని పూర్తిగా అరికట్టడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అరబికా పార్చిమెంట్ కిలోకు రూ.450, అరబికా చెర్రీ కిలోకు రూ.270, రోబస్టా చెర్రీ కిలోకు రూ.170కు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. 1175 మెట్రిక్ టన్నుల కాఫీ కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించామని, లక్ష్య సాధనలో ఎలాంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని అధికారులను ఆదేశించారు. అనంతరం చింతపల్లి మండలం బురిడీ వీధి పరిధిలోని కాఫీ తోటలను పరిశీలించారు. చింతపల్లి మండల జీసీసీ డివిజన్ కార్యాలయం, గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలోని పెట్రోల్ బంక్‌ను పరిశీలించారు. జీసీసీ సంస్థల పనితీరు మరింత మెరుగుపడి గిరిజనులకు ప్రత్యక్ష లాభం చేకూరేలా సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జీసీసీ హెడ్ ఆఫీస్ అధికారి శ్రీనివాస్, డివిజన్ మేనేజర్ సింహాచలం, జీసీసీ మేనేజర్ సుగుణదం, టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

వైద్యాధికారితో మాట్లాడుతున్న ఎంపిడిఒ ఎస్‌డి శ్యాంసుందర్‌రావు, ఎంపీటీసీ కె బొంజుబాబు

## వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై ఎంపిడిఒ ఆగ్రహం

ప్రజాశక్తి-పెదబయలు : సీతగుంట పంచాయతీ పరిధి పెదబయలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంపై ఎంపిడిఒ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతకు సీతాగుంట పంచాయతీ కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి గూబరి నీలకంఠం భార్య లింగమ్మ బయలుదేరగా, మూగజీవాలు తరుముకుంటూ వచ్చి తొక్కేశాయి. గాయాలపాలైన ఆమెను కుటుంబ సభ్యులు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న పెదబయలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకొచ్చారు. మధ్యాహ్న భోజన సమయం కావడంతో ప్రాథమిక చికిత్స కూడా చేయకుండా కొద్ది సేపు నిరీక్షించాలని సూచించారు. దీంతో కోపోద్రిక్తులైన మాజీ ఎంపీటీసీ నీలకంఠం వెంటనే స్థానిక సర్పంచి పి.మాధవ రావుకు, ఎంపీటీసీ కె.బొంజుబాబుకు, ఎంపీడీఓ ఎస్‌డి శ్యాంసుందర్‌రావుకు సమాచారం అందించారు. వెంటనే సర్పంచ్, ఎంపిటిసి, ఎంపీడీఓ హాస్పిటల్ చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారితో చర్చించారు. అత్యావసర వైద్యం కోసం వచ్చినప్పుడు నిర్లక్ష్యం వహించడం సరికాదని, మరో సారి పునరావృతం కారాదని హెచ్చరించారు. లంచ్ అవర్ కావడంతో కొద్దిగా ఆలస్యమైందని వైద్యాధికారి సమాధానం చెప్పడంతో ఎంపీడీఓ కాస్త ఆగ్రహం వ్యక్తం చేశారు. భోజన సమయంలో ఒకరు విధి నిర్వహణలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. లింగమ్మను కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో ఇంటికి తరలించారు.

## లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరిలో సమ్మె

### - ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు చ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరిలో అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తున్నామని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె.అచ్యుతరావు తెలిపారు. సోమవారం టౌన్ కొత్త రోడ్‌లోని పోర్ట్ యూనియన్ కార్యాలయంలో ఎఐటియుసి విశాఖ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం ఎం.మన్మధరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అచ్యుతరావు మాట్లాడుతూ, లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2026 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా కార్మికవర్గం సమ్మెకు సిద్ధమవుతోందని తెలియజేశారు. ఈనెల 31 న ఎఐటియుసి అఖిలభారత ప్రధాన కార్యదర్శి అమర్జిత్‌కౌర్ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా పౌరగ్రంథాలయంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

## విశాఖ ఐఐఎంకి మూడు ప్రతిష్టాత్మక అవార్డులు

ప్రజాశక్తి-ఎంవిపికాలనీ: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం ప్రతిష్టాత్మక పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అవార్డుల్లో ఒకే ఏడాది మూడు బహుమతులను గెలుచుకుంది. నైపుణ్యాభివృద్ధి, డిజిటల్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా వ్యూహాత్మక వినియోగంలో ఈ గుర్తింపు లభించింది. డెహ్రాడూన్‌లో జరిగిన పిఆర్‌ఎస్ఐ అవార్డుల కార్యక్రమంలో ఐఐఎం విశాఖపట్నం ప్రథమ బహుమతి, ఈ-న్యూస్‌లెటర్‌లో ద్వితీయ బహుమతి, కార్పొరేట్ ప్రచారంలో సోషల్ మీడియా ఉత్తమ వినియోగంలో తృతీయ బహుమతులను సాధించింది. ఉత్తరాఖండ్ శాసనసభ స్పీకర్ రితు ఖండూరిభూషణ్, ఎంపి రమేష్ పోఖ్రియాల్ చేతుల మీదుగా సంస్థ ప్రతినిధి ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం అవార్డులు అందుకున్నారు. డైరెక్టర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఒకే ఏడాది మూడు అవార్డులు రావడం గర్వకారణమన్నారు.